క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా దుర్గాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రభుత్వ సంగీత కళాశాల ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తి రోడ్డు, దుర్గా పురం, బావాజీ పేట, రామ కోటిమైదానం, నూరి హాస్పిటల్ ఏరియా, శారదకాలేజీ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పూజా మండపాల నిర్మాణంపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పూజా మండపాలపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో దేవస్థానం పూజా మండపాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించింది. నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ సిద్ధం కావడంతో ఆలయ ఈఈ కోటేశ్వరరావుతో చైర్మన్ స్థల పరిశీలన చేశారు. అదే విధంగా మల్లేశ్వరాలయం వద్ద క్యూలైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈఈ కోటేశ్వరరావును కోరారు. స్వామి వారి దర్శనానికి ప్రతి నిత్యం భక్తులకు విశేషంగా విచ్చేస్తున్న నేపథ్యంలో క్యూలైన్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాధ్యమైనంత త్వరగా స్వామి వారి ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం గుణదల పోలీసులు అరెస్టు చేసి మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కండ్రికకు చెందిన మానేపల్లి చిట్టిబాబు లచన్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. వెయిటర్‌గా వస్తున్న ఆదాయం సరిపోక చిట్టిబాబు బార్‌లో 24 క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి బార్ మూసివేసిన తరువాత అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను ఎస్సై వెంకట్రావుతో కలిసి ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలోని ఘటనాస్థలికి చేరుకుని మద్యం విక్రయిస్తున్న చిట్టిబాబును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా హర్ష



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ (ఏపీ ఎస్‌కెఎ) సభ్యుడైన పీకేఎస్ హర్ష ఏపీ స్టేట్ కరాటే రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గొల్లపూడిలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ వార్షికోత్సవంలో భాగంగా సెమినార్, రిఫరీ జ్యూరీ పరీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియ (కాయ్) జనరల్ సెక్రటరీ షిహాన్ రజనీష్ చౌదరి చేతుల మీదుగా హర్ష నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రజనీష్ చౌదరి మాట్లాడుతూ కరాటే విద్యలో సుశిక్షతులైన హర్షను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన ఏపీ ఎస్‌కెఎ జనరల్ సెక్రటరీ జె.శ్రీనివాసులు అభినందనీయులన్నారు. ఏ పోటీల్లో అయినా రిఫరీలు కచ్చితత్వాన్ని పాటించాలని తెలిపారు. తనను రిఫరీ కమిషన్ సభ్యుడిగా నియమించిన శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన నేతృత్వంలో శిక్షణ పొందిన తాను పోటీలలో నిబద్ధత, నిజాయతీగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు పట్టుదల, సమయపాలన, నిర్దిష్ట ప్రణాళికతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం రామన్నగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ లక్ష్య సాధన నిర్దేశించుకుని దానికి అనుగుణంగా విద్యార్థులు చదవాలని చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో నుంచి పుట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, కరోనా వంటి కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు చరిత్రలో మరచిపోలేనివని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 30, 57, 58, 59, 60 డివిజన్ల వార్డు సచివాలయాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వార్డ్ వలంటీర్లలకు సేవా మిత్రా, సేవ రత్న, సేవ వజ్ర పురస్కారాల మహోత్సవ కార్యక్రమం సింగ్‌నగర్ షాదీఖానాలో బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో కాలయాపన చేయడం, అవినీతిని ప్రోత్సహించి ప్రజలను మోసం చేశారన్నారు. నేడు జగనన్న వచ్చాక అందరికీ అన్నీ పథకాలను ఎటువంటి అవినీతికి తావులేకుండా అందిస్తున్నామంటే దానికి కారణం వలంటీర్లేనని కొనియాడారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బీహెచ్‌ఎస్వీ జానారెడ్డి, ఇసరపు దేవి, ఎండీ షాహినా సుల్తానా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ఇసరపు రాజు, బెవర నారాయణ, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ మంత్రి, సెంట్రల్ నియోజకవర్గం సమన్వకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 63వ డివిజన్ 273 సచివాలయం పరిధిలో సుమారు 270 గడపలను వెలంపల్లి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి, డ్రైనేజీ సమస్యల గురించి ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. పథకాలు అందుతున్నాయని, వృద్ధులైతే ప్రతి నెలా ఒకటవ తేదీ తెల్లవారుజామునే పింఛను అందిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొంటామని మహిళలు ఎదురొచ్చి స్వాగతం పలకడం, హారతులు ఇవ్వడం సంతోషాన్ని కల్గించాయన్నారు. పేదలంటే ఇష్టంలేని చంద్రబాబు దుర్మార్గుడని వెలంపల్లి విమర్శించారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే చంద్రబాబు కోర్టుకెళ్ళి స్టే తీసుకొన్నారని పేర్కొన్నారు. అయినా 2024లో జరిగే ఎన్నికల్లో మన పార్టీ గెలుస్తుందని, పేదలకు ఇళ్ల స్థలాలు అక్కడే ఇస్తామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార కాంగ్రెస్‌పార్టీ నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, పెంట్యాల అనిల్, తిరుపతిరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గంగానమ్మ దేవతకు పూజలు చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు



సమస్యలు తెలుసుకొంటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

కనులపండువగా గుడి పునఃప్రతిష్ఠ

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో గ్రామ దేవత గంగానమ్మ–పోతురాజు స్వామి వార్ల విగ్రహ గుడి పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కనులపండువగా నిర్వహించారు. గణపతి పూజ, ఆవాహిత దేవతల అర్చనలు, హోమాలు, అమ్మవారి కి అత్యంత ప్రీతికరమైన మహా శక్తివంతమైన నవ చండీ హోమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు గంగానమ్మదేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించేలా ఆశీస్సులు అందించాలని గంగానమ్మ దేవతను కోరారు. ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గ్రామ దేవతలు శక్తి స్వరూపాలని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం 5 వేల మందికి అన్నదానం చేశారు.

జ్ఞాన సముపార్జనలో మాతృభాష కీలకపాత్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్): జ్ఞాన సముపార్జనలో మాతృభాష కీలకపాత్ర పోషిస్తుందని రచయిత, జన సాహితీ సంస్థ అధ్యక్షుడు దేవీ కుమార్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో గొప్ప గొప్ప విజ్ఞాన ఆవిష్కరణలన్నీ మాతృ భాషలోనే జరిగాయని తెలిపారు. అవసరానికి ఎన్ని భాషలు అయినా నేర్చుకోవచ్చని, కానీ దానికి మాతృభాష సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాతృభాష గొప్పతనంను వివరించారు. డాక్టర్ కేవీ శాంతకుమారి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఎలా ప్రారంభమైందో వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్వర్యానదుర్గాపురం గౌతమ్ పబ్లిక్ స్కూల్లో మాతృ భాష ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ ఎన్ని భాషలు ఉన్నా మాతృభాషలోని కమ్మదనం మరెందులోను కనిపించదన్నారు. అమ్మ భాష మాతృభాష అని అటువంటి మాతృభాష బోధన చేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు పి.శేఖర్, శారదా కుమారి, భువనేశ్వరిలను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కొండాయ గుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, స్కూల్ ప్రిన్సిపాల్ భూషణ్ నాగ మల్లిక, షఫీ, పోతుల విల్సన్‌రాజు, పి.ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవీ కుమార్

వేదాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు
- వేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వేదాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. గాంధీనగర్ శారదా కాలేజీలో బుధవారం తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మణ విద్యార్థి గృహం ఆధ్వర్యంలో 100 మంది వేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విష్ణు పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో వేల సంవత్సరాల నుంచే వేద విజ్ఞానం ఉందన్నారు. వేదం భగవంతుని స్వరూపమని విశ్వమానవ శ్రేయస్సు కోసమే భగవంతుడు వేదాలను సృష్టించాడని తెలిపారు. ఆధునిక పరిశోధకుల ఊహలకు సైతం అంతుచిక్కని విద్య, వైజ్ఞానిక, సామాజిక, ఆర్థిక విషయాలెన్నో వేదాల్లో ఉన్నాయన్నారు. కనుకనే వేదాల గొప్పదనాన్ని విదేశీయులు సైతం కీర్తిస్తున్నారన్నారు. అటువంటి అమూల్య గ్రంథాలు మనకు వారసత్వ సంపదగా లభించడం అదృష్టమని చెప్పారు. వాటిని పరిరక్షించి వేద విద్య వ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు గత కొద్ది దశాబ్దాలుగా తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ హరినారాయణ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తాము సంపాదించిన కోట్ల రూపాయల ఆస్తులను మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలకు కేటాయిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. నగరానికే తలమానికమైన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెలాఖరులోగా హరినారాయణ విగ్రహాన్ని ప్రారంభించుకుంటామని వివరించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కుందా సీతారామశాస్త్రి, వేద పండితులు గుంటూరు శ్రీరామచంద్రమూర్తి సోమయాజి, ట్రస్ట్ ప్రెసిడెంట్ జంధ్యాల శంకర్, ఉపాధ్యక్షులు జి.ఈశ్వర్ పాల్గొన్నారు.



వేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

8 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో వచ్చే నెల 8వ తేదీ నుంచి 10 తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరశింహరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు విశేషంగా అభిషేకాలతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 10 గంటలకు నవగ్రహాలకు ఏకవార అభిషేకం, 12 గంటలకు రుద్రహోమం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం చేస్తామన్నారు. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు శాంతి కళ్యాణం జరుగుతుందన్నారు. సాయంత్రం మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు ముత్యాలంపాడు పురవీధులమీదుగా సాగుతుందన్నారు. 10వ తేదీ ఆదివారం మధ్యాహ్నం వేజెళ్ళ రాజేంద్రప్రసాద్ దంపతులచే అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం స్వామివారి పవళింపు సేవతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత శుభ మంగళ నాదస్వర సేవ, మండప దేవతలకు అర్చనలు, మహామంత్ర హోమాలు చేశారు. వాస్తు జ్యోతిష్యుడు, వేద పండితుడు జంధ్యాల రాజేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో ఉదయం 10.29 గంటలకు 12 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం పూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. స్వామివారిని శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, వైఎస్సార్ సీపీ నాయకుడు వింత శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, గ్రామ సర్పంచ్ బడుగు బాలమ్మ, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భాషపై పట్టుతో ఉన్నత స్థానాలు

గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమలపూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జ్యోతి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలకు మాతృభాష ఆవశ్యకతను తెలియజెప్పాలన్నారు. పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేసి భాష పట్ల మక్కువ పెంచాలన్నారు. భాష పై పట్టు సాధించేలా చేసి వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందన్నారు. గ్రంథాలయంలో భాషకు సంబంధించి అనేక పుస్తకాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. గ్రంథాలయ అధికారి కె. రమాదేవి , జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు ఝాన్సీ రాణి మాట్లాడుతూ మహిళలందరూ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. మంచి పుస్తకాలను చదివి పిల్లలకు వివరించి వారి బంగారు భవిష్యత్తుకు చక్కటి పునాది వేయాలన్నారు. జ్యోతి మహిళా మండలి సభ్యులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న జ్యోతి మహిళా మండలి సభ్యులు

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారికి తులసీదళార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో పవిత్ర జలాన్ని తీసుకొచ్చి నిత్యార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దశావతార మంత్ర పారమాత్మిక హోమం చేశారు. తులసీదళాలతో సహస్ర అర్చన నిర్వహించారు. ప్రముఖ ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో పలువురు అర్చకులు ఆధ్వర్యంలో ఆయా వైదిక కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు.

శ్రీవారి కంటే అమ్మవారే ఎక్కువ.....

కాదు....అమ్మవారి కంటే అయ్యవారే ఎక్కువ...... అంటూ పండితులు వాదించుకుంటూ ఎదుర్కోలు ఉత్సవాన్ని రక్తి కట్టించారు. బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. రెండు వర్గాలుగా కూర్చొన్న పండితులు, ఉభయదాతలు శ్రీ వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ దేవి వార్ల గుణగణాలను కీర్తించారు. ఆగమ పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన హనుమద్వాహనంపై స్వామి వారిని అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, భజన బృందాలు, అర్చక స్వాములు వెంటరాగా స్వామి వారి వాహనోత్సవం ముందుకు సాగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంధన పొదుపు కార్యకలాపాలను అమలు చేయాల్సిన ఆవశ్యకతలో భాగంగా కేవలం ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌కు చెందిన సిరి ఎక్సెర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. నగర పాలక సంస్థ నూతన భవనం సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్ లెవల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఇంధన పొదుపుపై వర్క్‌షాప్ నిర్వహించారు. పంప్ ఆపరేటర్లకు మున్సిపాలిటీల్లో ఎనర్జీ ఎఫిషియన్సీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. మున్సిపల్ వాటర్ పంపింగ్, స్ట్రీట్ లైటింగ్‌లో ఇంధనాన్ని ఆదా చేయడం గురించి చెప్పారు. ఇంధన శక్తి పొదుపులో భాగంగా విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా స్థిరత్వాన్ని కాపాడుకునేందుకు కార్బన్ ఉద్గారాలను తగ్గించేటప్పుడు బొగ్గు, చమురు, గ్యాస్ వంటి వేగంగా క్షీణిస్తున్న వనరులను కూడా సంరక్షిస్తుందని వెల్లడించారు. వివిధ రంగాల్లో పొదుపు చేయాలంటే వీధి దీపాల్లో 5–10 శాతం, పంపింగ్‌లో 20–25 శాతం, మురుగునీటి పంపింగ్‌లో 15–20 శాతం, మున్సిపల్ భవనాల్లో 5–10 శాతం చేయవచ్చని వివరించారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఇసీఎమ్) డిఇఇ జీ శ్రీనివాసులు, నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) ఎన్.ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార రెడ్డి మున్సిపాలిటీల్లో ఇంధన సామర్థ్యంపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణం, శ్రీనివాసులు

పాన్ ఇండియా వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): పెళ్లిళ్ల, శుభకార్యాలు, పండుగల సీజన్ సందర్భంగా బందరు రోడ్‌లోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా వెడ్డింగ్ వోగ్స్ జ్యూయలరీ అండ్ వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, బొండా సుజాత, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, రాధిక, మాధవి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 75 ప్లస్ లగ్జరీ బ్రాండ్స్ స్టాల్స్ వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. అలాగే ప్రముఖ బ్రాండెడ్ జ్యూయలరీ షోరూమ్స్, క్లాత్ వేర్ షోరూమ్స్ నిర్వాహకులు గోల్డ్, డైమండ్, శారీస్, డ్రెసెస్ ఇతర ఉత్పత్తులను అమ్మకం కోసం ఇక్కడ ఏర్పాటు చేశారు. అదే విధంగా డిజైనర్ వేర్, క్లాతింగ్ మెటీరియల్, చీరెలు, ఫ్యాషన్ యాక్ససరీస్, జ్యూయలరీ ఐటమ్స్‌తోపాటు ఒక గ్రాము జ్యూయలరీ కూడా అందుబాటులో లభిస్తున్నాయని నిర్వాహకులు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ తెలిపారు.

24న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 24వ తేదీన జరగనుంది. పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5–55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై తీరగా, భక్తులు, దీక్షాదారులు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొంటారు. అమ్మవారి ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాల ప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, శ్రీనివాసమహాల్, బ్రహ్మణ వీధి, రథం సెంటర్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. భక్తులందరూ పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో భారతీయ రైల్వే 'అమృత్ భారత్ స్టేషన్' పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ఈ నెల 26న విజయవాడ డివిజన్‌లోని గుణదల రైల్వే స్టేషన్‌ను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు '2047 విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వేస్' థీమ్‌తో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ పెయింటింగ్ వేసిన ముగ్గురు విద్యార్థులను రైల్వే అధికారులు విజేతలుగా ప్రకటించారు. వారిలో మొదటి స్థానంలో ఎ.శ్రీహాస్, రెండవ స్థానంలో ఎం.ప్రవీణ్, మూడవ స్థానంలో జె.ప్రభుకుమార్ నిలిచారు. ఈ నెల 26న గుణదల రైల్వే స్టేషన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనే విశిష్ట అతిథుల చేతుల మీదుగా వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పాయకాపురం(విజయవాడరూరల్): 62వ డివిజన్‌కు చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. నారాయణ(పండు) ఆయన అనుచరులకు వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు స్వాగతం పలికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ దఫా కూడా రాష్ట్రంలో ఎగిరే జెండా వైఎస్సార్ సీపీ అని వెలంపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, బొరా బుజ్జి, రామిరెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వీరమ్మతల్లి తిరునాళ్లు



ఉయ్యూరు: ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లలో భక్తజన కోలాహలంతో సందడిగా మారింది. ఆలయ ప్రవేశం చేసిన అమ్మవారిని బుధవారం వేకువజాము నుంచే భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పొంగలి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. గ్రామాల నుంచి డప్పు వాయిద్యాలతో చలువ కావిళ్లతో భక్తులు ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యం చెందారు. సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేష్‌కుమార్‌లు తిరునాళ్ల బందోబస్తును పర్యవేక్షించారు.